# చలంగారి "మ్యూజింగ్స్"

అడపా రామకృష్ణరావు

'నాకెప్పుడూ అనుమానమే ఇప్పుడు - నేను రాసేవి 'చలం' అనే పేరుతో చలామణి అవుతున్నాయా? లేక నిజంగానే నేను రాసేవి ఎవరికన్నా అవసరమా? అనేది నాలో ఈనాడు పెద్దప్రశ్న' అంటూ ఇటీవల 'తెలుగు స్వతంత్ర' పత్రికలో చలంగారు తమ సందేహాన్ని వెల్లడించారు. సంఘంలో ఘనీభవించి కూర్చున్న కల్మషాన్నీ, మూఢతనూ కడిగి, అత్యాచారాలకు గురి అవుతున్న వ్యక్తులకు నైతికంగా ప్రోద్బల మివ్వడముకోసం సజీవరచనలుచేసి ఒకనాడు యువలోకానికి నవోత్తేజం కలిగించిన చలంగారు ఈ నాటికి వ్రాస్తున్న 'మ్యూజింగ్స్' తీరుచూస్తే, 'అరుణ' 'శశాంక' 'సావిత్రి' వంటి రచనలు చదివి చలంగారిని గౌరవించడం నేర్చుకున్న ఆయన 'భక్తు'లకుకూడా ఈనాడు అదే సందేహము కలుగుతూవుంది.

ఏమంటే - చలంగారు 'మ్యూజింగ్స్' వ్రాస్తున్నారంటే పాఠకులు వినోదపూర్వకంగాగాని, ఉదాత్తమైన ధోరణిలో కాని సమకాలిక సమస్యలను గురించి, జీవితపు ఆటుపోటులను గురించి వారి అభిప్రాయం తెలుసుకోవడానికి అవకాశముంటుందని ఎదురుచూస్తారు. లేదా, వినోద విజ్ఞానాల నటుంచి, గొప్ప శిల్పంతో, ఎంతో నేర్పుగా ఒక కళాశీలి తన జీవితములోని గాఢమైన అనుభూతులను మనకు తెలుపుతారని ఆశిస్తారు. చలంగారి పూర్వరచనలు చదివి వారి కళాభిజ్ఞతనుగూర్చి ఎంతో విశ్వాసం కుదుర్చుకున్న పాఠకులకు 'మ్యూజింగ్స్' చాలా ఆశాభంగం కలిగిస్తున్నవి.

'మ్యూజింగ్స్'లో చలంగారి పూర్వ రచనలలోని కళావిశిష్టత ఏమాత్రం కనిపించదు. 'శశిరేఖ' 'చిత్రాంగి' 'కన్నీటికాలవ' వంటి పుస్తకాలలోకనిపించే స్నేహమయుడైన పడుచు'చలం' కనిపించడు. కేవలం అకారణమైన తన యిష్టాయిష్టాలను ప్రకటించుకుంటూ కూర్చున్న వృద్ధ 'చలం' ఎదురవుతాడు. ఇటీవలనే ఒక సంచికలో 'ఆ అపశబ్దాలమీద కసిని తీర్చుకోడానికి నాకీ కాగితమే గతి!'అని వ్రాశారు. చలంగారి అవ్యాజమైన ఆదరద్వేషాలకంటె ప్రధాన విషయాలను వినడానికి కుతూహలపడే పాఠకులకు 'మ్యూజింగ్స్' తీవ్రంగా అసంతృప్తి కలిగించడం సహజం. చమత్కారంగా(?) అందరూ 'ఔ'నన్నవి 'కా'దన్నంత మాత్రాన పాఠకులు పరవశులు కారు. చలంగారి రచనలలో పాఠకులు సహేతుకమైన విమర్శకోసం ఎదురుచూస్తారు కాని చాలా సామాన్యమైన సంగతులను గురించి చలంగారి కళాకళలు ఏమిటో తెలుసుకోవాలని ఉండదు. ఆయనకు వ్యక్తిగతంగా ఒకస్త్రీ కంఠం మీద అభిమానమూ, మరొకస్త్రీ కంఠమంటే ఏవగింపూ ఉండవచ్చు. అది కేవలం వ్యక్తిగతమైన అభిమానం తప్ప, దానిని పురస్కరించుకుని తీర్పు చెప్పడానికి హేతుపూర్వకమైన ప్రమాణం ఏమీలేదు.

> 'ఎప్పుడో ఒక రోజు రాత్రి కొన్ని నెలల కోసారి, బతిమాలగా బతిమాలగా పాప పాడుతుంది, రజనీకాంత రావునించి తను స్వయంగా నేర్చుకున్న పాటని, 'ప్రేమగానము, ప్రేమగానమూ' అని 'ఎవరు విన్నారెవరు కన్నారు' మల్లే ఎవరికో ఇచ్చి పాడించి నాశనం చెయ్యకపోవడంవల్ల, ఆపాట మీది భక్తి నా మనసులో చచ్చిపోక నిలిచింది గావును.'

పాప పాడితే చలంగారికి 'ప్రేమగానము' బాగుంది. సూర్యకుమారి పాడితే 'ఎవరువిన్నారు' బాగుండలేదు. ఇది కేవలం తన వ్యక్తి గతమైన అభిమానానికి సంబంధించిన విషయం. పాఠకులు 'మ్యూజింగ్స్'లో చలంగారి వ్యక్తిగతమైన ఆదరణకంటె ముఖ్యమైన విషయాలనుగూర్చి

ఆయన ఎలా భావిస్తున్నారో తెలుసుకోవాలని ఎదురు చూస్తారు.

> 'ఈవూళ్లోకూడా రేడియోస్టేషన్ పెట్టబోతున్నారు. ఆ స్టేషన్‌కి వెళ్లే రోడ్డుమీద ఇప్పణ్ణించే — మృదంగాలు పట్టుకుని ఫిడేళ్లు శ్రుతి చేసుకుని, వీణలు మోయిస్తో, తయారైన కథలూ, నాటకాలూ, ఉపన్యాసాలూ కట్టలు చేతిలో పట్టుకునీ, కొందరు యిప్పుడే రాగ ధోరణీ కంఠాలు వినిపిస్తో బారులు బారులుగా నిలిచివుంటున్నారుట... రేడియో వారంతా యీ వూళ్లో పూర్తిగా చేరిం తరవాత యీఆకాశం యింత ఉజ్జ్వలంగా ప్రకాశిస్తుందో లేదో అని భయమేస్తోంది.'

చలంగారు క్రమంగా ప్రజలకూ, లోకానికీ, కళకూకూడా దూరమవుతున్నారా అని అనుమానము కలుగుతుంది. ప్రజాజీవితంలో రేడియో ఆక్రమించిన స్థానాన్ని కాని, ప్రచార సాధనంగా రేడియోకుగల ప్రభావాన్ని కాని ఈనాడు గుర్తించకుండావుండే అవకాశంలేదు. ఆకాశం కాంతిహీనం కాకుండానే ఆంధ్రుల ప్రత్యేక రేడియో స్టేషన్ ఎలా ప్రయోజనకరంగా నిర్వహించాలో నిర్మాణాత్మకంగా సూచించి, పాఠకుల, శ్రోతల అభిరుచికి చలంగారు ఒక ప్రమాణాన్ని కల్పిస్తే దేశం ఎంతో కృతజ్ఞతతో స్వీకరించివుండును.

'ఆర్టిస్టుకి 'ఎర్త్' అనేది లేదు. 'హెల్ అండ్ హెవెన్' మాత్రమే' అని సొరీస్‌గారన్నారట. అది చాలా గొప్పమాటే. కాని 'మ్యూజింగ్స్'లో కొన్ని చోట్లకేవలం తన చుట్టుప్రక్కల సంచరించే వ్యక్తుల యథాలాపాలను తీసుకుని, వారి ప్రతిభావ్యుత్పత్తుల ప్రమేయం లేకుండా, అవి శిరోధార్యమైన భావాలైనట్టు చలంగారు అంగీకరిస్తున్నారు. లీలగారన్నారని దేశంలో విజ్ఞులందరూ ఉత్తమనాటకమని అంగీకరించిన 'కన్యాశుల్కం' కేవలం 'ఫార్స్' అంటూ చలంగారు దానిని నిరాకరించారంటే అది చలంగారి బలహీనత అనిపిస్తుంది.

విమర్శకు ఒక ప్రమాణాన్ని కల్పించ గలిగిన వ్యక్తి కేవలం తన ఇష్టాయిష్టాలమీద విమర్శకు పూనుకోవడం దురదృష్టం. 'రసపాయి' అనే మాట తనకు బాగుండదట. కనుక ఆ మాటతో ఒకపాట వ్రాసిన కవిని గూర్చి—

> 'ఆ కవి ఎవరోకాని, ఇతర విధాల నేను గౌరవం ఇవ్వవలసిన మనిషి కాకుండా ఉండాలని, జన్మజన్మాలకీ ఈ కవిని నేను నిలుపుకోడానికి నాకు అభ్యంతరం కలగకూడదనీ కోరుకుంటాను.'

అని వ్రాశారు. పరిణతమైన శబ్దసంస్కారం ఉన్నవారందరూ 'రసపాయి' 'మధుపాయి' వంటి శబ్దాలను ఆమోదించారు. చలంగారికి ఈ మాటలు నచ్చలేదనుకుందాం. కాని ఒక్కమాటలో ఒక పాట విలువను, రచయిత బ్రతుకును చలంగారు నిర్ణయిస్తారా? యువకులకు సాహిత్యాభిరుచిని గూర్చి చలంగారు ఇటువంటి విపరీతమైన ప్రమాణాలు కల్పిస్తే 'మ్యూజింగ్స్' పాఠకులకు అసంతృప్తి కలిగించడంలో ఆశ్చర్యంలేదు.

ఇలా నిర్హేతుక ఆదర ద్వేషాలకు 'మ్యూజింగ్స్' ఆటపట్టు కావడమే కాకుండా, వారి అలక్ష్యంవల్ల కొన్ని తప్పులుకూడా దొర్లుతూ ఉంటున్నవి. చలంగారి భావాలకు కొంత విలువ ఇచ్చి స్వీకరించే పాఠకులు ఇతరులనుగూర్చి దురభిప్రాయాలేర్పరచుకోవడానికి ఈ సత్యేతర ప్రాసంగిక విషయాలు అవకాశం కలిగిస్తున్నవి.

'నేను ధనవంతుణ్ణని ఎక్కడో రాశారుట కుటుంబరావుగారు. రాశారో లేదో ఇంతకీ.'

అని వ్రాస్తూనే, 'కుటుంబరావుగారిని నిరుత్సాహపరచడంలో ఉపయోగం నాకు కనపళ్లేదు' అంటున్నారు చలంగారు. చలంగారిని గురించే కాదు, వ్యక్తిగతంగా ఏ రచయిత ఆస్తిపాస్తుల్ని గురించి అయినా కుటుంబరావుగారు ఎప్పుడూ వ్రాసినట్టు కనిపించదు. కుటుంబరావుగారు చలం ధనికుడని వ్రాయలేదు. మనుష్యుడి సమస్యలతో, అవసరంతో ఏ ప్రమేయమూ లేకుండా శృంగారంలో మునిగి తేలే రసికుడన్నారు - వారి 'కొత్త చిగుళ్ళు' అచ్చుపడిన రోజుల్లో. దురదృష్టం కొద్ది

చలంగారిలో ఇప్పుడా శృంగారం కూడా శుష్కించి పోయింది.

ఈ విధంగానే—

> 'ఆ సినిమాలోనే రోజూ ఒకరికార్డు వినిపిస్తున్నారు కొద్ది రోజులనించి: 'ఓ తోటలో...అందగా డెవరే!' అని...ఆ పాట 'రజని' రాశారని అన్నారు ఎవరో. అదే నిజమైతే— ఆ పాటకంతా ఏం?—ఆ అంద గాడెవరే? అని రాసినందుకు, ఆయన పేర ప్రచారమవుతున్న దేశభక్తి కీర్తనలన్నిటికీ కళాలోకంలో పూర్తిగా ఆ ఒక్కమాటలో పాపపరిహార మయిందనిపించింది '

అని 'రజని' పాటల-పాపాలమీదతీర్పుచెప్పారు. ఆ పాట 'రజని' వ్రాశారని 'ఎవరో' అన్నారట. ఆ 'ఎవరో' చెప్పిన మాటలమీద చలంగారు నిస్సంకోచంగా వ్యాఖ్యానం ప్రారంభించారు. ఆ పాట అసలు రజనీకాంతరావుగారు వ్రాసింది కానే కాదు. చలంగారు మరి ఏ చనువుతో అంత నిశ్చింతగా విమర్శచేశారో తెలియదు. పైగా పాటలవిలువను వాడిన ఒకమాటతో నిర్ణయించబోవడం అన్యాయం. ప్రత్యక్షంగా యీ విమర్శను చూచినవారెవరైనా 'దేశభక్తి కీర్తనల' ఖండన పరిగ్రహింపవచ్చా? చలంగారు పాపపుణ్యాలు పట్టడం ఆశ్చర్యం.

'గొప్పవాళ్ళమని తామూ, ఇతరులూ అనుకునే వాళ్ళు...' అంటూ ఒకవంక పరిహాస మాడుతూ, 'మ్యూజింగ్స్' అంతటా తమయిచ్చాను సారమైన అభిమాన ద్వేషాలనుగురించి, తాము గొప్పవారని 'హారతి' పట్టే తమ 'భక్త' కోటిని గురించి వ్రాయడం తప్ప పాఠకుని ఆశలను చలంగారు గమనించడమే లేదు.

'నీలమే కాంతిగా మారుతున్న శారదాకాశానికీ, ఆనందంమల్లే పొంగి వొచ్చే తెల్లని మబ్బుకీ, వూసిరి ఆగేట్టు మొహాన్ని అలలమల్లే ముంచే గాలికీ వీపు తిప్పి' చలంగారు 'మ్యూజింగ్స్' వ్రాస్తున్నారుట. ఇటు మామూలుప్రపంచానికీ వీపు తిప్పివేశారు. మరి-ఎందుకోసమో, ఎవరికోసమో-యింత శ్రమపడి వ్రాస్తున్నారు. ఉన్నత యోచనకోసం, ఉత్తమ విమర్శ కోసం 'మ్యూజింగ్స్' తిరగవేసే చదువరుల్ని కొరగానివాళ్లగా చూడ్డం కాదా యిది?

# దురదృష్టం

అనగా అనగా 'సహారా' ఎడారిలో ఒక ఉష్ట్రపక్షి ఉండేది. అది ఒక సాయింకాలంపూట ముస్తాబై తన అభిమాన 'ఒయాసిస్సు'కి షికారు వెళ్తామనుకొంది. తన స్నేహితులైన మరి నాలుగు ఉష్ట్రపక్షులు తారసిల్లితే కులాసాగా సాయంకాలం గడుపుదామనుకొన్నది. బాగా ముస్తాబై వెళ్ళి నాలుగుపక్కలా కలయచూసింది. నాలుగైదు ఉష్ట్రపక్షులు మెడలు భూగర్భంలోకి దూర్చి వినోదిస్తున్నాయి మన నాయకుడైన ఉష్ట్రపక్షి నాలుగుదిక్కుల కలయచూశాక "ఎంతదురదృష్టం— పిట్టమనిషెవ్వరూ పిస్తోలు బారుచేసినా లేరు" అనుకొంది.

# "చలంగారి మ్యూజింగ్స్"-

## చలం జవాబు

ఈ వారం స్వతంత్ర తిరగేస్తో సారిస్-

'ఎవరో నీ మ్యూజింగ్సు మీద రాశారు' అంది.

చాలామందిమి గుమిగూడి సరదాగా చదువుకున్నాం, ఈ శరత్కాలపు ఆహ్లాదకరమైన మధ్యాన్నం.

ఈనాడు నేనింకా రాయడం అవసరమా అన్న సందేహం ఈనాటితో తీరిపోయింది.

చాలా అవసరం - ఆడపా రామకృష్ణరావుగారికీ, ఆయనకి కుమ్మక్కునిచ్చి రాయించినవారికీ.

కాకపోతే ఓ మూల నా మ్యూజింగ్సు పేజీలు వృథాచేస్తున్న స్వతంత్రలో-ఇంకా కొన్ని పేజీలు ఆయన వ్యయం చెయ్యరు, ఎందుకూ పనికిరాని నా మ్యూజింగ్సుని తిట్టడానికని.

ఆయన రాసిన కారణాలన్నిటికీ సమాధానాలు ఆయన వ్యాసంలోనే వున్నాయి. వాటిని చూసుకోగల స్థిమితం ఇంకా రాలేదు. వస్తే అంత సులభంగా పట్టుబడివుండరు.

ఎందుకూ పనికిరానిదాన్ని, ఎందుకూ పనికిరాదని ఇంత శ్రమపడి చెప్ప నక్కర్లేదనే స్పష్టమైన 'కాన్‌ట్రడిక్షన్'ని ఆయన గమనించనే లేదు.

చాలా గర్వంగావుంది నాకు. నా కలంలో ఏ మాత్రం బలం తగ్గలేదన్నమాట. ఏమిటో ఇష్టమూ, కోపమూ ఏమీ లేకుండా చదువుతున్నారు గావును - ఎందుకు రాయడం? అనుకున్నాను.

నా పుస్తకాలు ఎవో ఈనాడు ఈయన మెచ్చుకుంటున్నారే, వాటిని ఆనాటి వాళ్లు తిట్టారు ఇట్లానే. వాళ్లు ఆరాధించే దేవతల్ని — చెండనాడానని! ఈనాడు ఈయన ఆరాధించే కళాదేవతల జోలికి వెళ్లానని ఆయన తిడుతున్నారు.

'స్టుపిడిటీ రిపీట్స్ యిట్‌సెల్ఫ్ త్రూఅౌట్ ఏజెస్'

ఈయన పూర్వీకులూ, ఈయనా నా గ్రంథాల్ని విమర్శించేందుకు ఇంత అధికారం తీసుకోగాలేనిది, నా ఒక్కడికేనా కన్యాశుల్కాన్ని విమర్శించే అధికారం లేంది?

విజ్ఞులందరూ అంగీకరించిన దాన్ని విమర్శించకూడదనే దాంట్లో ఎంత భావదాస్యం ముందో గమనించారా? ఏది మర్యాదో, ఏది అందరు గౌరవస్తులూ ఔనన్నారో, ఏది డబ్బు ఇస్తోందో, దాన్ని గౌరవించడం బతుకుగాగలవారికి బాధే మరి, రేడియోని తిట్టడం! ఈనాడు చలం పాత పుస్తకాలు కొంతవరకు మర్యాదలో విజ్ఞులు చేర్చకపోతే ఈయనకి వాటిని మెచ్చుకోడానికి ఎన్ని గుండెలు!

నా మ్యూజింగ్సు స్వతంత్రలో పడకపోయిన వారం కారణమేమిటని నన్ను ప్రశ్నించే. నాకు రాసే మిత్రులు స్వతంత్రకు రాసేటంత సమర్థులు కాదు. ఐతే, నా విమర్శకుల్లో ఎప్పుడో చేరిపోయి వుందురు. రామకృష్ణరావుగారూ, ఇంతకష్టపడి ఇదంతా రాయకపోతే, నాకు ప్రాధేయపడుతో నన్ను బతిమాలి బతిమాలి, నామీద ఏదో 'ఆ చెట్టులో పుట్టేదంతా చావ' అని కవిత్వాలు కోట్‌చేసి, నేను రాయకపోతే పత్రిక ఇంకెందుకన్నట్లు బలవంతంచేసి రాయించే సూనృతులైన శాస్త్రిగారితో ఒక్కమాట చెపితే, నా మ్యూజింగ్సు బాధ సునాయాసంగా తీరిపోయేది కదా మీకు!

కాని మీరెట్లానూ రాయకండా వుండరు లెండి, మీకు ఎక్కడెక్కడ తగిలిన గాయాల కసో ఎట్లా తీర్చుకుంటారు మరి, ఇట్లా కాకపోతే!

—చలం

# "మ్యూజింగ్స్"

చలం

ఓసారి నా భక్తుల్లో ఒకరు,—

ఇంతవరకు రాస్తోవుండగా, కళ్ళజోడు బాగుచేయించుకోడానికి నిర్ణయించుకున్న కాలం దాటిపోతోందని తెలిసింది. ఇంతా మానేసి పోతే బాగుచేస్తారా? మళ్ళీ నాకీ 'మూడ్' 'వొస్తుందా? శాస్త్రిగారు క్షమిస్తారా? కాని ఆకళ్ళజోళ్లు బాగుచేసే ఆయన 'పాపం, చలంగారు—ఈయన పనిని, భక్తితో వొద్దు, శీఘ్రంగానన్నా ముగించి పంపిద్దాం' అనుకుంటూరా? 'ఈయన పాపిష్ఠి కళ్ళ...జోడుని నా వృత్తి అయోగ్యతవల్ల బాగు చెయ్యవలసిన అవసరం కలిగింది కదా!' అని దిగులుపడతారు. ద్వేషం, అపవాదు తప్ప ఏమీ ప్రతిఫలంలేని యీ రాతపని ఇన్నేళ్లు నేనెందుకు చేస్తున్నానా అని చాలాసార్లు నాకు ప్రశ్న వొస్తుంది యీనాడు. కాలంవల్ల రక్తనాడులు మందమూతున్నాయి గావును! అనేక దృష్టులనించి, సాధారణ మానవజాతిలో వికృతం ఇతను అనేట్టు తలిచే అనుభవాన్ని స్వీకరిస్తో ఇంత హాయిగా, నిర్లక్ష్యంగా బతకగలిగానంటే నామీద నాకు గౌరవం కలుగుతుంది.

వారంరోజులు కాలేదు—

'చలంగారు మేళాలుపెట్టి పెళ్ళి చేయిస్తున్నారా?' అని ఆశ్చర్యపడ్డారు, నామీద చాలా గౌరవం అని కొన్నాళ్లనుకొన్న ఒక ఘురానా వారు. మొదట ఆపెళ్ళి చలంగారు చేయిస్తున్నారో లేదో కనుక్కుందామన్న ఔదార్యం వుండదు. పోనీ ఎందుకు చేయించకూడదు అనే ప్రశ్నరాదు.

కాని యింకాసేపటికే యింకోరు నన్నే అడిగేశారు. చాలా మంచిపని చేశారు. కాని నా జవాబుని అర్థం చేసుకోలేరుకద!

'పెళ్ళిని ఒప్పుకోమంటూరుట మీరు. మీ యింట్లోనే పెళ్ళి జరిగిందే!'

'అవును. నేను ఒప్పుకోని సంగతులు జరక్కుండామానవు. ఆపడం నాకు సాధ్యమైనా, మాన్పించాలనీ వుండదు,'

'మరి యీ మిత్రులు యింత దూరాన్నించి వొచ్చి, మీ యింటో ఎందుకు పెళ్లి చేసుకున్నారు? మీ ఆశీర్వాదం కోసం కాదు?'

'ఆశీర్వాదాలలో నాకు నమ్మకమూలేదు. ఆశీర్వాదా లియ్యగల ఘనతకి నేను రానూలేదు.'

'అయితే పోనీ, మీ 'గుడ్‌విషెస్' కోసమనండి.'

'పెళ్లి చేసుకున్న యీ మిత్రులు సుఖపడాలనే వుంటుంది, నాకు. కాని ప్రత్యేకం యీ పెళ్లి జరగడంవల్ల సుఖపడాలని ఏమీ వాంఛించను.'

నా పక్కనవున్న యింకోరు—

'ఈ పవిత్ర భారత భూమిలో ఎన్నడూ వివాహంమీద గౌరవం, పాతివ్రత్యంలోని ఘనతా పోనేపోవు'-అన్నారు దిఖాక్కరంగా. పోకుండా తాను అడ్డపడతా నన్నంత బలం చూపించారు కంఠంలో. ఆయన విశ్వాసం భారతమాతలోనో, ముక్కోటి దేవతల్లో ఎవరి మీదనో.

'మీ కళ్లముందే మీ పవిత్ర భారతమాతే ముక్కలుగా పంపకమయింది. సామవేదం కాలం నాటి మద్యం నిషేధమయింది. వర్ణాశ్రమధర్మాలు పేరుకైనా కనపడకుండా మాయమూతున్నాయి. ఇంకా చెప్పమంటూరా? చాలునా?' అన్నాను.

నా కయిష్టమైనవి నా చుట్టూ జరుగుతోవుంటే నేను నవ్వుతో చూస్తాను. ఆ నిమిషాన్నే బాండూ, సన్నాయీ రెండూ ఒకే కాలంలో రెండు వేరే పాటల్ని ఒకరు 'ఆజా, ఆజా!', రెండోవారు

'సావన్కి బాదలూ' అంటోవుంటేకూడా విసుక్కోలేదు. పెద్ద పులివేషపు నాట్యానికి 'బ్యాక్ గ్రౌండ్'గా 'దునియామే కౌన్ హమరా?' అంటో దరువు తొరతొరగా దంచితే విని యింకా బతికేవున్నాను.

అట్లాంటి హాస్యాలతరవాత నవఖాళీ హత్యలు నన్నేం కలవర పెట్టగలవు? ఇంక పెళ్లిళ్లూ, బళ్లో పసిపిల్లల్ని కొట్టే దెబ్బలూ చాలా స్వల్పమైన యిబ్బందులు.

మనకి అయిష్టమైన పనులు చేసినంతమాత్రాన వాళ్లమీది యిష్టం, స్నేహం చెడకూడదంటే అర్థమౌతుంది మనుషులకి. కాని తమ భర్తలూ, తమ భార్యలూ, తమ పిల్లలూ చేసినా ఏమీ ప్రేమకి ఆటంకం కాకూడదనే స్వతంత్రేచ్ఛ ఏమైనా అర్థంకాదు. పుట్టిన నిమిషంనించికూడా పసిపాప స్వతంత్రాన్ని నమ్మి ఆచరించే నా ప్రవర్తనా పద్ధతి చాలా దగ్గరి మిత్రులకికూడా అర్థంకాదు.

ఇప్పుడే సౌరిస్ అంటోంది.

'ఆర్టిస్టుకి 'ఎర్త్' అనేదిలేదు. 'హెల్ అండ్ హెవెన్' మాత్రమే'నని. చాలా గొప్పమాట అది.

ఆర్టిస్టుకి అజీర్ణంచేస్తే 'ఇన్‌ఫెర్నో'లో పడ్డాననుకొని, ఒకగొప్ప బాధా చిత్రమో, పద్యమో రాస్తాట్ట.

ఒకసారి తారానాథ్ అన్నారు.

'రాఘవాచారి చాలా 'గ్లూమీ మూడ్స్'లో హడావిడి చేసేవాడు. నేను, 'మైడియర్ రాఘవ, యిట్ యీజ్ నథింగ్ బట్ ఎ స్పెల్ ఆఫ్ కాన్‌స్టిపేషన్' అనేవాణ్ణి'అని.

రాస్తోవుండగా మేజస్ట్రేటు వెంకట్రావు వొచ్చాడు. కలం కిందపెట్టి అతనివంక తిరిగాను. అతనివేపే కాదు, ఇందాకణ్ణించి నీలమే కాంతిగా మారుతున్న శారదాకాశానికీ, ఆనందంమల్లే పొంగిపొంగి వొచ్చే తెల్లని మబ్బులకీ, వూపిరి ఆగేట్టు మొహాన్ని అలలమల్లే ముంచే గాలికీ వీపు తిప్పి రాస్తున్నాను, ఎంతసేపటినించో. శాస్త్రిగారూ, ఈ పాపమంతా మీదే.

ఇంతకీ అసలు సంగతి రాయలేదు-

నామీద ఎంతో ఆదరంకల మిత్రుడు చాలా యేళ్ళకిందట నన్ను......

ఈ సౌరిస్ చిన్నప్పటి మల్లే మధ్య అడ్డం వొస్తో నన్ను సరిగా రాయనీకుండా నవ్విస్తోంది.

ఆ మిత్రుడు నన్ను రైలెక్కిస్తో - అన్నాడు.

'ఈ రైలెక్కి మీరు రాత్రంతా ప్రయాణం చెయ్యడానికి ఈ గుంపులో మిమ్మల్ని వొదలడానికి నా చేతులు రావటంలేదు. కాని యింకో విధంగా మిమ్మల్ని మీ వూరు చేర్చగలశక్తి నాకు లేదు -' అనాడు అతనూ నా అంత బీదవాడు. ఈనాడు గొప్ప ఉద్యోగస్థుడైనాట్ట. అందుకని సహజంగా నా ప్రసక్తి మానుకున్నాడు.

నా వెనక రావిచెట్టు ఆకులు ఎండలో తళతళలాడుతున్నాయి. చిలకలు గుంపులుగా కొబ్బరిచెట్టుమీదనించి ఆకు పచ్చ మెరుపులమల్లే బాదం చెట్టులోకి మాయమై సంతోషరవాలుచేస్తున్నాయి. వీటన్నిటికీ అంధుణ్ణయి, ఈ కాగితాల్ని నలుపు చేస్తున్నాను...

నేను రాసినవి చాలా సన్న అక్షరాల్లో అచ్చువేస్తున్నారుట. షా తన పేరుకూడా గుర్తుపట్టలేకుండా ఉంది అచ్చులో.

ఇంకేం రాయను? చిత్ర రేడియో తెరిచింది. అ హజంగా ఎక్కిళ్లు కక్కుకుంటో, మధ్యమధ్య నవ్వును కారుస్తో ఎదో పేర్లపట్టీ చదువుతున్నారు, పిల్లల పేర్లుట. పాపం చిత్రకి సరదాగావును! అ అపశబ్దాలమీది కసిని తీర్చుకోడానికి నాకి కాగితమే గతి! కొన్ని నెలలు 'పకపక' మద్రాసు రేడియో పిల్లల కార్యక్రమానికి వెళ్లడంకన్న తన జీవితాదర్శం వేరే లేదనేది. ఇంకెవరూ తనకి లోబడేవాళ్లు కనపడక, నన్ను ఏమ్మని పట్టుపట్టింది. ముందు రైలెక్కడం, అందులో మద్రాసుకు, పైగా రేడియోస్టేషన్‌కి ప్రయాణంకావడం నాకెంత బాధో వివరించిచెప్పినా, పకపకని నమ్మించలేకపోయినాను. తనకోసం కాక నేనెవరికోసం ఎన్నెన్ని బాధలు పడుతున్నానో జ్ఞాపకంచేసి, దెప్పింది. ఇంక తప్పదనుకున్నాను. కాని కన్నాంబగారు ఎంతలేదన్నా దేవుడున్నాడు. మద్రాసునించి పెద్దనాన్నమీద—సౌరిస్ అంటోంది, 'పాపం కన్నాంబగారు నీ ఆసరా చూసుకుని దేవుడు లేడన్నారు. ఇప్పుడు ఇది 'గ్రాండ్ బిట్రేయల్'గా ఆమె అనుకుంటుంది, నువ్విప్పుడు దేవుడున్నాడంటే' అంది.

అవును. మద్రాసునించి పెద్దనాన్నమీద చాలా ప్రేమగల తార, మద్రాసురేడియోతో చిరపరిచితురాలు తార, వొచ్చింది యీ వూరు. వెంటనే

పకపకా, తారా మద్రాసురేడియో సంగతులూ, ముఖ్యం పిల్లల ప్రోగ్రాంలూ మాట్లాడుకున్నారు. ఎవరో రేడియో అక్కయ్యట. ఎవరన్నా ఆడపిల్లలు వెళ్ళగానే ఆమె ప్రేమతో కావిలించుకుని తీసికెడతారట. ఆ విషయమైన వివరాలు విన్న తరవాత, పకపక మద్రాసు పేరెత్తడంగాని, ఆ పిల్లల ప్రోగ్రాములు మా చెవులకింద రేడియోలో తిప్పడంగాని మానింది.

ఈ వూళ్లోకూడా రేడియో స్టేషన్ పెట్టబోతున్నారు. ఆ స్టేషన్‌కి వెళ్లే రోడ్డుమీద ఇప్పణ్ణించే—మృదంగాలు పట్టుకొని, ఫిడేళ్లు శ్రుతి చేసుకునీ, వీణలు మోయిస్తో, తయారైన కథలూ, నాటకాలూ, ఉపన్యాసాలూ కట్టలు చేతిలో పట్టుకునీ, కొందరు యిప్పుడే రాగధోరణీ కంఠాలు వినిపిస్తో బారులు బారులుగా నిలిచివుంటున్నారుట. ఆ రేడియోస్టేషన్‌కి వెళ్లేదారికి ఇదివరకు 'లవర్స్‌లేన్' అని పేరు. ఆ చక్కనిరోడ్డుకి, యిప్పుడీగతి పట్టింది. ఇంక రేడియో వారంతా యీవూళ్ళో పూర్తిగా చేరింతరవాత యీ ఆకాశం యింత ఉజ్జ్వలంగా ప్రకాశిస్తుందో లేదో అని భయమేస్తోంది. ఇప్పుడే ఉత్తరం వొచ్చింది, తమాషా, చికాకోలునించి—'ఈమధ్య మన వెంకటస్వామినాయుడుగారు వారి గొప్ప సన్మానం సందర్భంలో మద్రాసు వెళ్ళారనీ, ఆయన విరోధులెవరో ఆయనకి ఏదో మత్తుపదార్థం వుపయోగించారనీ, చాలా అగౌరవపరచడానికి యత్నించారని, చాలా పుకారుగావుంది యిక్కడ' అని రాశారు—నిజమై వుంటుందా?

హారీన్ భగవాన్‌మీద కృతజ్ఞతతో రాస్తున్నారు - తాగుడు, సిగరెట్లు మొదలైన దురభ్యాసాల్ని మాన్పించారని. నిజంగా హారీన్‌రాశారా? అవన్నీ దురభ్యాసాలనడం, వాటిని భగవాన్ వొదిలించారనడం...అందుకు కృతజ్ఞత చూపడం, సంతోషించడం! అయ్యో! భక్తీ, దేవుడూ, ఆధ్యాత్మికమార్గం అందుకునే యింత అప్రతిష్ఠపాలైనాయి, ఏ మాత్రం ఆత్మగౌరవమూవున్న మానవుల దృష్టిలోనూ! హారీనే అట్లా వ్రాస్తే! ఆ రెండేనా, ఇంకా తక్కిన ఆనందాల్నికూడా తీసేసిననాడుగాని సంపూర్తికాదు గావును, భగవాన్ అనుగ్రహం! సుబ్బారావు చెపుతున్నాడు- నిన్న ఓ పుస్తకం లోంచి, నావొళ్లు పులకరింప చేసిన మాటల్ని—

'ఛా ఛా చాలా పాపం ఆపని!' అంది యజమానురాలు.

'మరి పిల్లల్ని కనడానికే కదా యీ శరీరం?' అంది దాసి.

'కాదు. ఈశ్వరుణ్ణి ధ్యానించడానికి' అంది యజమానురాలు.

'అయితే ఎంత వేస్టు! ఈశ్వరుణ్ణి ధ్యానించడానికి యీ గర్భాశయం, అందుకు సంబంధించిన అవయవాలూ ఎందుకు యింత భద్రంగా సృష్టించడం?'

వొయ్యి తోచనప్పుడు ఒకత్తా చీట్లపేకతో, 'సోలిటేర్' ఆడుకుంటో వుంటుంది. ఆ ఆటని చూచినప్పుడు, యీ సృష్టి అంతేగావును, దీనిని కల్పించిన శక్తి, యీ జడత్వపు నిర్జీవత్వం వుందని దాన్ని ఒక అభ్యంతరంచేసి దాన్ని జయించి జీవితాన్ని చలనాన్ని కలిగించాలనే యత్నంలోనూ, మానవవ్యక్తి స్వాతంత్ర్యం అనే అభ్యంతరాన్ని తానే కల్పించి, దాన్ని ఓడించి, ఊడ్చి, తన ఉద్దేశాన్ని నెరవేర్చుకునే ఆట ఆడుతోందేమో ననుకుంటాను అప్పుడప్పుడు. 'ఏం? భగవాన్ భక్తులందరికీ ముక్తి నివ్వకూడదా?' అంటారు. ఇస్తే! ముక్తి నిమ్మని అడిగేందుకు ఎవరూ వుండరు మరి! వుండకపోతే నేమంటే—వొయ్యి ఆడే ఆటలో ఏముక్కల్ని ఆముక్కలమీద ఒకసారిగా పారేస్తే ఆటేలేదు. ఈలోపల ఆ రాజులకీ రాణులకీ బాధ కదా అంటే, ఆబాధ వుత్తఆటే నని ఆడేవాళ్ళకి తెలుసుకదా అంటాము. అట్లానే మనం ఎంతో ఘోరమైన బాధలనుకునేవన్నీ వుత్త ఆటలకింద తీసుకుని 'ఎన్‌జాయ్' చేస్తూ నవ్వుతున్న విశ్వహృదయం కుందేమో!

హారీన్, భగవాన్ అనుగ్రహంవొచ్చిన రోజున మద్రాసు ప్రభుత్వానుగ్రహం వల్లే ఆ అనుగ్రహానికి సిగరెట్లూ తాగుడూ అడ్డునిలవ్వు.

Source: Press Academy Website, Telugu Swatantra Magazine, Dec 1948

Disclaimer: This SELECTIVE topic/article/write-up of Adapa and Chalam gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/